క్లుప్తంగా

నరేంద్ర స్వామికి ప్రత్యేక పూజలు



పెదపులివర్రు(భట్టిప్రోలు): వ్యాఘ్రపురి క్షేత్రంగా ప్రసిద్ధి గాంచిన భట్టిప్రోలు మండలం పెద పులివర్రు గ్రామంలో కొలువైన శ్రీ రాజరాజ నరేంద్ర స్వామి వారికి బుధవారం మాస శివ రాత్రి పురస్కరించుకుని ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నారద మహర్షి ప్రతిష్ఠించిన ఈ శివాలయంలో ప్రతి నిత్యం పూజలు జరుగుతాయి. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు.

కాయగూరల ధరలు పైపైకి

భట్టిప్రోలు: కొద్ది రోజుల క్రితం కిలో టమాటా రూ.20లు ఉండగా నేడు రూ.40 నుంచి రూ.50లు పలుకుతోంది. వర్షాలు ఎక్కువైతే ధరలు మరింతగా పెరిగే అవకాశాలు ఉన్నాయి. వేసవి కావడంతో కాయగూరల ధరలు పెరగడానికి కారణమని వ్యాపారులు చెబుతున్నారు. ఇతర పట్టణ ప్రాంతాల నుంచి కాయగూరలు కొని ఇక్కడకు తెచ్చి వ్యాపారులు అమ్ముతున్నారు. టమాటా, మిరప ధరలు కొండెక్కాయి. పచ్చిమిర్చి ధర కిలో రూ.100లు పలుకుతుంది. ధరలను చూసి పేద, మధ్య తరగతి ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పేదలకు అన్నదానం



తెనాలిరూరల్: సినీ దర్శకుడు దిలీప్‌రాజా తన జన్మదినాన్ని పురస్కరించుకుని పేదలకు నూతన వస్త్రాలు అందజేసి వారితో కలిసి భోజనం చేశారు. తెనాలి మండలం కొలకలూరు గ్రామంలో కాల్వ కట్ట వెంబడి కొంతమంది నిరుపేదలు నివసిస్తున్నారు. తన జన్మదినం సందర్భంగా బుధవారం అక్కడకు వెళ్లిన ఆయన వారికి వస్త్రాలు ఇవ్వడంతో పాటు ఆహార పొట్లాలు అందజేసి వారితో కలిసి భోజనం చేశారు.

బాల సాహిత్య పుస్తకావిష్కరణ



తెనాలిఅర్బన్: తెలంగాణ సారస్వత పరిషత్ వారు రూపొందించిన 'బాల సారస్వతం' పిల్లల కథల పుస్తకాన్ని బోసురోడ్డులోని నెహ్రూనికేతన్ పాఠశాలలో బుధవారం పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గీతాకాంత్‌లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలకు చెందిన రచయితలు పంపిన 117 కథలతో సంస్థ వారు అయిదు పుస్తకాలు ముద్రించినట్లు తెలిపారు. తెనాలికి చెందిన బాలసాహితీవేత్త షేక్ అబ్దుల్ హకీం జానీ రూపొందించిన నాలుగు గుండిగలు కథ కూడా పుస్తకంలో ఉందన్నారు. అనంతరం హకీం జానీని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు డి పావని, ఏ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

నాగేశ్వరస్వామి దేవస్థానంలో మాస శివరాత్రి ప్రత్యేక పూజలు



చేబ్రోలు: వసంత రుతువులోని వైశాఖ మాస బహుళ చతుర్దశి మాస శివరాత్రి సందర్భంగా ఖ్యాతి గాంచిన చేబ్రోలులోని నాగేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రజత నాగాభరణంలో ప్రత్యేక అలంకారంలో స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. వసంత రుతువులో లభ్యమయ్యే పూలు, పండ్లతో పూజలు, అలంకరణను అర్చకులు నిర్వహించారు. ఈ రుతువులో లభ్యమయ్యే మల్లెపూలు, మామిడి ఫలాలతో పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



చెరుకుపల్లిలో మొక్క నాటుతున్న ఎంఈవో లాజర్



కర్లపాలెం డంపింగ్ యార్డ్ వద్ద మొక్కలు నాటిన ఎలీషాబాబు

చెరుకుపల్లి: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని ఎంఈవో పులి లాజర్ అన్నారు. అంతర్జాతీయ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా మండలంలోని గుళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పర్యావరణాన్ని పరిరక్షించే చెట్లను పరిరక్షించాలన్నారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటడంతో పాటు వాటి పెంపకానికి కృషి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం కే.కవిత, జిల్లా జన విజ్ఞాన వేదిక ఉపాధ్యక్షుడు కాటూరి నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, పీసీ చైర్మన్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణంతోనే భవిత

కర్లపాలెం: పర్యావరణాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఈవోపీఆర్డీ ఎ.ఎలీషాబాబు తెలిపారు. అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా బుధవారం కర్లపాలెం డంపింగ్ యార్డ్ వద్ద ఈవోపీఆర్డీ ఎలీషాబాబు మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకునేందుకు అందరూ మొక్కలు పెంచాలని సూచించారు. వాతావరణ కాలుష్యాన్ని నివారించుకునేందుకు ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని సూచించారు. దమ్మనవారిపాలెంలో సర్పంచ్ గురపుసాల వెంకటేశ్వరమ్మ డంపింగ్ యార్డ్ వద్ద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమాల్లో కర్లపాలెం పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, దమ్మనవారిపాలెం కార్యదర్శి సునీత ఉన్నారు.



భట్టిప్రోలులో మొక్కలు నాటుతున్న వాసవీ క్లబ్ నిర్వాహకులు

పచ్చదనంతోనే ఆరోగ్యకర సమాజం

వేమూరు: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం చాలా అవసరమని ఎంపీడీవో జీఎస్‌వీ శేషగిరిరావు అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకొని రాబోవు తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మండల విద్యాశాఖాధికారి-2 రోజీల్యాండ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహ స్వామి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో..

భట్టిప్రోలు: ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకుని భట్టిప్రోలు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. పర్యావరణ మిత్రుడు మద్దుల వెంకట రాజారాం ఆధ్వర్యంలో స్థానిక గ్రామ దేవత శ్రీ దండి పార్వతి అమ్మవారి దేవాలయంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయులు బొలిశెట్టి శ్రీనివాసరావు(బీఎస్సార్), నంబూరు నాగభూషణరావు, ఎం.లక్ష్మీ నరసింహం, క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు బి. సుబ్బారావు, బి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



జంపని జెడ్పీ పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎంపీడీవో శేషగిరిరావు

సత్తా చాటని స్వతంత్రులు

- ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపని అభ్యర్థులు
- ప్రధాన పార్టీల అభ్యర్థుల మినహా అందరి డిపాజిట్లు గల్లంతు
- 13 మందికి నోటా కంటే తక్కువ ఓట్లు

భట్టిప్రోలు: వేమూరు ఎన్నికల బరిలో 13 మంది అభ్యర్థులు పోటీ చేయగా ప్రధాన పార్టీలకు చెందిన అభ్యర్థుల మినహా మిగిలిన 13 మంది అభ్యర్థులు పెద్దగా ఓట్లు సాధించలేక పోయారు. టీడీపీ అభ్యర్థి నక్కా ఆనందబాబుకు 94,922 ఓట్లు, వైఎస్సార్ సీపీ అభ్యర్థి వరికూటి అశోక్‌బాబుకు 72,901 ఓట్లు వొచ్చాయి. పోటీ చేసిన 15 మందిలో 13 మందికి డిపాజిట్లు గల్లంతయ్యాయి. పోలైన ఓట్లల్లో 6వ వంతు ఓట్లు వస్తే డిపాజిట్ దక్కుతుంది. కానీ ఎవరికీ ఆ మేరకు ఓట్లు రాకపోవడంతో డిపాజిట్లు దక్కలేదు. విశేష మేమిటంటే బరిలో ఉన్న 13 మంది అభ్యర్థులకు నోటా కంటే తక్కువ ఓట్లు వొచ్చాయి. నోటాకు 1763 ఓట్లు పడగా మిగిలిన అభ్యర్థులకు అంతకంటే తక్కువ వచ్చాయి. వేమూరు నియోజకవర్గంలో భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి బూరగ సుబ్బారావుకు 1664, బీఎస్పీ అభ్యర్థి గొరికపూడి స్టీవెన్‌కు 681, ఇండిపెండెంట్ అభ్యర్థులు చేబ్రోలు బోడియ్యకు 162, నాయుడు నిఖిల్ కృష్ణకు 146, గద్దె విజయ లక్ష్మికి 77, కనపర్తి శరత్‌బాబుకు 70, జెబీఎన్‌పీ అభ్యర్థి డి.భాగ్యరాజుకు 132, పీపీవోఐ అభ్యర్థి కట్టెపోగు విజయ్‌కుమార్‌కు 75, ఎస్‌పీ పార్టీ అభ్యర్థి తమనం భూషణంకు 74, జెఆర్‌బీహెచ్‌పీ అభ్యర్థి యలమాటి శ్యామ్ ప్రసాద్‌కు 53, జేజేఎస్పీ అభ్యర్థి రవీంద్రబాబు జడాకు 53, పాముల విజయకుమారికి 39, కొలకలూరి విజయ్ పాల్‌కు 39 ఓట్లు పోలయ్యాయి. ప్రధాన పార్టీలకు చెందిన ఇద్దరు అభ్యర్థులు మినహా మిగిలిన వారందరికీ తక్కువ ఓట్లు రావడం గమనార్హం.

నూతక్కి అబ్రహాం విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

తెనాలిరూరల్: మధుర కవి నూతక్కి అబ్రహాం విగ్రహాన్ని తెనాలి బండ్‌పై ఏర్పాటు చేయాలని మాదిగ అభివృద్ధి సంక్షేమ సంఘం(మాస్) సభ్యులు కోరారు. 'మాస్' రాష్ట్ర నాయకులు కూచిపూడి మోహన్ మాదిగ ఆధ్వర్యంలో రూరల్ మండలం కొలకలూరు గ్రామ సెంటర్ వద్ద గుర్రం జాషువా ప్రియ శిష్యుడు నూతక్కి అబ్రహాం 25వ వర్ధంతి సందర్భంగా బుధవారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు ఉన్నం ధర్మారావు మాదిగ మాట్లాడుతూ గుర్రం జాషువా గబ్బిలం రచిస్తే శిష్యుడు అబ్రహాం మత్కుణం మీద రాసిన పద్యం మరువలేనిదని అన్నారు. న్యాయవాది సుద్దపల్లి మురళీధర్ మాట్లాడుతూ తెనాలి బండ్‌పై అబ్రహాం విగ్రహాన్ని ఏర్పాటు చేసే విధంగా ఎమ్మెల్యే మనోహర్ చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో సుద్దపల్లి అంబేడ్కర్, భవనాసి హేబెల్, మోదుకూరి దావీదు, ఉన్నం జానుబాబు, ఉన్నం చిన్నజాను, ఉన్నం సన్నీ, ఉన్నం గోపి, ఉన్నం ఇమ్మానుయేలు, జర్నలిస్ట్ నూతక్కి ఆచారి, నూతక్కి స్వరాజ్ వర్మ పాల్గొన్నారు.



కవుల చిత్ర పటాలకు నివాళులర్పిస్తున్న సభ్యులు

మండే ఎండలతో సతమతం

భట్టిప్రోలు: మండల ప్రజానీకం సూర్య తాపంతో బుధవారం సతమతమయ్యారు. కొద్ది రోజులు చల్లగా ఉన్న వాతావరణం మరలా వేడెక్కింది. ఒక్కసారిగా వేసవి ఉష్ణోగ్రత పెరగడంతో ప్రజలు విలవిల్లాడారు. ఒక వైపు ఉష్ణోగ్రత అధికంగా నమోదు కావడంతో ప్రధాన రహదారులతో పాటు వీధులన్నీ జనసంచారం లేక బోసిపోయాయి. సాయంత్రం అయినా ఉష్ణతాపం తగ్గకపోవడంతో శీతల పానీయాలు తాగి కొంతమేర ఉపశమనం పొందారు.

వైభవంగా హనుమాన్ జన్మదిన వేడుకలు

తెనాలి: స్థానిక షరాఫ్ బజారులోని శ్రీ సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో వార్షిక హనుమాన్ జన్మదిన వేడుకలు, శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం శ్రీ హనుమత్ గాయత్రీ హోమం, 108 సార్లు శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ, సాయత్రం స్వామి వారికి 1108 లడ్డూల అర్చన చేశారు. పండితులు వైదిక క్రతువును ఆగమోక్తంగా నిర్వహించారు. శ్రీ హనుమాన్ చాలీసా పారాయణలో మహిళా భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన కర్త ములుకుట్ల విశ్వనాథ శర్మ సుందరకాండ ప్రవచనం చేశారు. భక్తులు విశేషంగా పాల్గొని ఆంజనేయ స్వామికి ప్రదక్షిణాలు చేసి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఈవో అవుతు శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ వార్షిక హనుమాన్ జన్మదిన వేడుకల్లో భాగంగా జూన్ 11వ తేదీ వరకు వార్షిక హనుమాన్ జన్మదిన వేడుకలు, 16వ లక్ష శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ జరుగుతాయని పేర్కొన్నారు. ప్రతిరోజు 108 సార్లు శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ, స్వామి వారికి విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు తీసుకోవాలని కోరారు. శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి సంకీర్తన బృందం, శ్రీ పంచముఖ ఆంజనేయ స్వామి సంకీర్తన సేవాసమితి సంయుక్త ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరుగుతున్నాయని తెలిపారు. ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ, నిఖిల్ శాండిల్య, కౌన్సిలర్ పసుపులేటి త్రిమూర్తి, సంకీర్తన బృందం అధ్యక్షురాలు మూర్తి అనురాధ, సంకీర్తన సేవాసమితి సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, గుడివాడ బాలకృష్ణ, ఉప్పల వరదరాజులు, మడుపల్లి చంద్రశేఖర్, ఆర్.సురేష్, ఎం వెంకటేష్, బి.లీలాప్రసాద్, గోలి సోమశేఖర్, సంకీర్తన బృందం సభ్యులు పాల్గొన్నారు.



ఆంజనేయునికి లడ్డూలతో అర్చన

పర్యావరణానికి 'పొగ'

- మొక్కజొన్న, జొన్న పంట దంటు తగలబెడుతున్న రైతులు
- వాతావరణ కాలుష్యానికి కారణమవుతున్న వైనం
- రోటావేటర్ల సాయంతో కలియదున్నాలంటున్న అధికారులు



తగలబడుతున్న మొక్కజొన్న దంటు

భట్టిప్రోలు: మొక్కజొన్న దంటును దహనం చేయడం పర్యావరణానికి చేటని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. డెల్టా ప్రాంతంలో రెండో పంటగా సాగు చేస్తున్న జొన్న, మొక్కజొన్న పైరు కండెలు విరచిన తర్వాత నిరుపయోగంగా ఉంటున్న దంటును కొందరు తగలబెడుతున్నారు. కొన్నేళ్లుగా ఇదేవిధంగా దంటు కాలుస్తున్నారు. దీని వల్ల ఈ ప్రాంతంలో పర్యావరణ కాలుష్యం ఏర్పడుతుందని పలువురు చెబుతున్నారు. ఎండలు తీవ్రంగా ఉన్న ప్రస్తుత తరుణంలో జొన్న, మొక్కజొన్న దంటును కాల్చడం వల్ల అగ్ని ప్రమాదాలకు సైతం దారి తీస్తోంది. గ్రామాల్లో ఎప్పుడు ఏ విధమైన అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయోననే ఆందోళన నెలకొంది. మాగాణి పొలాల్లోని వరి కుప్పలు, ఎండు గడ్డి వాములు అగ్నికి ఆహుతై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మెట్ట పొలాలకు పక్కనే ఉన్న మాగాణి భూముల్లోని దంటుకు నిప్పంటించడంతో నిమ్మ, అరటి తదితర పైర్లు కూడా తగలబడుతున్నాయి. పొలం గట్ల పైనున్న చెట్లు, పలు రకాల మొక్కలు సైతం దహనమవుతున్నాయి.

రోడ్లపై పొగతో ప్రమాదాలు సైతం..

మధ్యాహ్న సమయాల్లో మొక్కజొన్న దంటుకు నిప్పంటించడంతో ఆయా గ్రామాల పరిధిలోని పొలాలు మొత్తం ఒక్కసారిగా మంటలు వ్యాప్తి చెందుతున్నాయి. పొగ, మసి, నుసితో గ్రామాలు నిండిపోతున్నాయి. రహదారులపైకి దట్టమైన పొగ చేరుకుని ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక రోడ్డు ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. రోడ్ల వెంట ఉంటున్న పలు రకాల చెట్లు, చేమలు కాలిపోయి వాతవరణ సమతుల్యం దెబ్బతిని పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఫలితంగా వడగాలులు తీవ్రం కావడంతో ప్రజ లు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. జొన్న, మొక్కజొన్న దంటును మాగాణి పొలాల్లో తగలబెట్టడంతో భూములకు గల సహజ సిద్ధమైన భూ భౌతిక లక్షణాలు సైతం దెబ్బతింటాయి.

రోటావేటర్లతో కలియదున్నాలి..



దంటును రోటావేటర్ల సాయంతో భూముల్లో కలియదున్నితే వ్యవసాయ భూములకు అవసరమైన సేంద్రియ ఎరువు లభ్యమవుతుంది. భూములు సైతం సారవంతంగా మారతాయి. తద్వారా రసాయన ఎరువుల వినియోగం గణనీయంగా తగ్గించవచ్చు ఇప్పటికైనా రైతులు స్పందించి దంటును కాలకుండా ఉంటే బాగుంటుంది.

–గొల్లపోతు మీరయ్య, ఏఓ, భట్టిప్రోలు

రోగులకు సంచుల పంపిణీ

గుంటూరు మెడికల్: ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా బుధవారం జీజీహెచ్ నాట్కో సెంటర్‌లో 300 మంది రోగులకు కీర్తన ట్రస్ట్ అధ్యక్షురాలు మేరీగ విజయలక్ష్మి ఆధ్వర్యంలో సంచులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్లు ఆశా సజని, గంగమ్మ, కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.



బాలికా విద్యకు అప్'గ్రేడ్'

- ఆదర్శంగా నిలుస్తున్న వెంగళరావునగర్ బాలికోన్నత ఇంగ్లిష్ మీడియం పాఠశాల
- గత ఏడాది ఎలిమెంటరీ స్కూలు నుంచి అప్‌గ్రేడ్
- పోటీ పరీక్షలకు ప్రత్యేక తర్ఫీదు
- డిజిటల్ తరగతుల ద్వారా విద్యార్థినులకు బోధన



వెంగళరావు నగర్‌లోని నగరపాలక సంస్థ బాలికోన్నత పాఠశాల

నెహ్రూనగర్: విద్యా రంగంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన విప్లవాత్మకమైన మార్పులతో గుంటూరు నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు అత్యున్నత ప్రమాణాలతో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా నిలుస్తున్నాయి. అద్భుతమైన ఫలితాల్ని సాధిస్తున్నాయి. విద్యార్థుల్ని మెరికల్లా తీర్చిదిద్దుతున్నాయి. తూర్పు నియోజకవర్గం పరిధిలోని వెంగళరావు నగర్ 5/3లో ఉన్న గుంటూరు నగరపాలక సంస్థ ఎలిమెంటరీ స్కూల్ గత ఏడాది జూన్ 28న ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలగా(1 నుంచి 10వ తరగతి వరకు) అప్‌గ్రేడ్ అయింది. ఈ విద్యా సంవత్సరం నుంచి ఆడపిల్లల్ని మాత్రమే చేర్చుకునేందుకు హెచ్‌ఎం, విద్యా కమిటీ సభ్యులు చర్యలు తీసుకున్నారు. తూర్పు నియోజకవర్గంలో పలు ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి తల్లిదండ్రులకు అవగాహన కలిగిస్తున్నారు.

సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

నగర పరిధిలో సీసీ కెమెరాల పర్యవేక్షణ కలిగిన ఏకైక పాఠశాలగా వెంగళరావునగర్ పాఠశాలను చెప్పుకోవచ్చు. నిత్యం సీసీ కెమెరాల పర్యవేక్షణలో నడుస్తుంది. ఉదయం 9 గంటలకు గల్లా గేట్లు క్లోజ్ చేస్తే ఇక సాయంత్రం 4 గంటలకే తెరుచుకునేది. మధ్యలో ఎటువంటి పర్మిషన్స్ ఉండవు. స్కూల్‌లోనే విద్యార్థినులకు రోజుకొక మెనూతో రుచికరమైన భోజనం అందిస్తున్నారు. ప్రభుత్వం రూ.20వేల విలువైన ఉచిత టెక్స్ట్‌బుక్స్, నోట్స్‌లు, వర్క్ బుక్స్, స్కూల్ బ్యాగ్, మూడు జతల యూనిఫాం, షూస్, సాక్స్, బెల్టు ఉచితంగా అందజేస్తోంది.



బోధన కోసం ఏర్పాటు చేసిన డిజిటల్ సెటప్

విద్యార్థినులపై వ్యక్తిగత శ్రద్ధ

ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా డిజిటల్ పద్ధతిలో బోధన చేస్తున్నారు. అన్ని రాష్ట్ర, జాతీయ పోటీ పరీక్షలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. జాతీయ, సంప్రదాయ పండుగల రోజుల్లో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థినుల్లో మానసిక ఉల్లాసం కోసం ఆటలు, ప్రతి శనివారం నో బ్యాగ్ డే, మాస్ డ్రిల్ నిర్వహిస్తున్నారు. ఉపాధ్యాయులు ప్రతి విద్యార్థినిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారు. చదువులో వెనకబడిన వారిపై మరింత దృష్టి సారిస్తున్నారు.

18 కాలనీలకు ఒక్కటే బాలికోన్నత పాఠశాల



బొంగరాలబీడు నుంచి ఇన్నర్ రింగ్ రోడ్డు వరకు, నెహ్రూనగర్ నుంచి అమరావతి రోడ్డు వరకు సుమారు 18 కాలనీలకు మధ్యలో వెంగళరావునగర్ బాలికోన్నత పాఠశాల ఉండటం విశేషం. సీసీ కెమెరాల నిర్వహణతో పాటు ఆర్వో ప్లాంట్ ద్వారా తాగునీటి సరఫరా చేస్తున్నాం. ప్రత్యేక వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి పాఠశాలకు సంబంధించిన సమాచారాల్ని ఎప్పటికప్పుడు తల్లిదండ్రులకు తెలియజేస్తున్నాం.

–పి. రమేష్, హెడ్ మాస్టర్, వెంగళరావునగర్ బాలికోన్నత పాఠశాల

విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు



సీఎం వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చారు. ముఖ్యంగా ఎలిమెంటరీ స్కూల్‌గా ఉన్న వెంగళరావునగర్ పాఠశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లగా వారు స్పందించి గత సంవత్సరం అప్‌గ్రేడ్ చేశారు. ఈ ప్రాంతంలో బాలికోన్నత పాఠశాల ఉండటం ఆడపిల్లల తల్లిదండ్రులకు భరోసా కలుగుతుంది.

– చందు పవన్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్

ఎన్నికల్లో ఉద్యోగుల పాత్ర ప్రశంసనీయం

గుంటూరు మెడికల్: ఎన్నికల నిర్వహణలో ఉద్యోగుల పాత్ర ప్రశంసనీయమని ఏపీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు అన్నారు. ఏపీ ఎన్జీవో హోంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న నారా చంద్రబాబునాయుడుకు ఉద్యోగుల పక్షాన అభినందనలు తెలిపారు. ఈ ఎన్నికల్లో ఉద్యోగులు ప్రముఖ పాత్ర పోషించారన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్, సాంకేతిక అంశాల్లో సహాయ సహకారాలు అందించిన ఎన్నికల కమిషన్, జిల్లా యంత్రాంగానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. కరోనా సమయంలో ఉద్యోగులు ప్రాణాలకు తెగించి సేవలు అందించారన్నారు. ఆంధ్రప్రదేశ్ నూతన ప్రభుత్వం ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను అర్థం చేసుకొని సానుకూలంగా స్పందించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి శెట్టిపల్లి సతీష్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, జిల్లా సంయుక్త కార్యదర్శి కురాకుల శ్రీనివాసరావు, ఏ.శ్యామ్ సుందర్ శ్రీనివాస్, గుంటూరు నగర అధ్యక్షుడు ఎస్.పి.ఎస్. సూరి, కార్యదర్శి సీహెచ్. కల్యాణ్ కుమార్, ప్రత్తిపాడు తాలూకా అధ్యక్షుడు సీహెచ్. అనిల్ కుమార్, సునీల్ కుమార్, వేణుగోపాల్, ఇస్సాకు తదితరులు పాల్గొన్నారు.

తెనాలిలో చిరుజల్లులు

తెనాలిఅర్బన్: తెనాలిలో బుధవారం సాయంత్రం చిరు జల్లులతో కూడిన వర్షం పడింది. ఉదయం నుంచి ఎండ వేడిమితో జనం అల్లాడారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి చిరుగాలులు వీచాయి. అనంతరం చిరు జల్లులతో కూడిన వర్షం కొద్ది సేపు పడింది. దీంతో ప్రజలు కొంత సేద తీరారు.